నేడు మేడారంలో తిరుగువారం పండుగ

ముగియనున్న మహాజాతర

తాడ్వాయి, ఫిబ్రవరి 27 : మేడారం సమ్మక్క-సారలమ్మ పూజారులు నేడు తిరుగువారం పండుగను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నెల 7న మండమెలిగే పండుగతో ప్రారంభమైన జాతర శని వారం వనదేవతల వన ప్రవేశంతో పూర్తయింది. అనంతరం వచ్చే బుధ వారం(నేడు) పూజారులు తిరుగువారం పండుగను నిర్వహించనున్నారు. దీంతో మహాజాతర ఘట్టం పూర్తిగా ముగిసినట్లు పూజారులు ప్రకటిస్తారు. సమ్మక్క-సారలమ్మ పూజా మందిరాల్లో పూజా సామగ్రిని శుద్ధి చేసి గుడిలో భద్రపరుస్తారు. అనంతరం సమ్మక్క-సారలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి పూజా మందిరాలకు తాళాలు వేస్తారు. తిరిగి వచ్చే ఫిబ్రవరిలో మినీ జాతర సందర్భంగా పూజా సామగ్రిని బయటకు తీసి పూజలు చేయనున్నారు.

ఆత్మకూరు ఎస్ఐ సస్పెన్షన్

బీఆర్ఎస్ నాయకులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించినందుకు వేటు

అగ్రంపహాడ్ జాతరలో 'జై తెలంగాణ' అని నినాదాలు చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఘటనలో ఆత్మకూరు ఎస్సై జీ దుర్గాప్రసాద్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తమవారిని అకారణంగా కొట్టిన ఎస్సైపై వేటు పడడంతో బాధిత కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- పరకాల/సుబేదారి/ఆత్మకూరు, ఫిబ్రవరి 27

ఈ నెల 23న ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ సమ్మక్క జాతరను పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కుటుంబ సభ్యులతో అమ్మవార్ల దర్శనానికి వెళ్లిన సందర్భంలో కొందరు బీఆర్ఎస్ నాయకులు 'జై తెలంగాణ' అని నినాదాలు చేశారు. ఈ ఘటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకున్నా రెండు రోజుల అనంతరం ఈనెల 25న ఎస్సై దుర్గా ప్రసాద్ బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులను అరెస్టు చేసి తీసుకెళ్లి థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. ఈ ఘటనలో బాధితులతో కలిసి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ వరంగల్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన సీపీ, డీసీపీ అబ్దుల్ బారితో దర్యాప్తునకు ఆదేశించారు. పలువురు బాధితులను కమిషనరేట్‌కు పిలిపించి విచారించిన డీసీపీ, నివేదికను సీపీకి అందించారు. దీని ఆధారంగా ఎస్సై దుర్గా ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

- ఉత్తర్వులు జారీచేసిన సీపీ అంబర్ కిశోర్ ఝా
- చల్లా 'చలో ఆత్మకూరు' పిలుపు ఎఫెక్ట్
- జై తెలంగాణ నినాదం గెలిచింది : మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి
- బాధిత కుటుంబసభ్యుల్లో హర్షం

ఆత్మకూరు ఎస్సై దుర్గాప్రసాద్

'చలో ఆత్మకూరు' ఎఫెక్ట్

బీఆర్ఎస్ నాయకులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై 24గంటల్లో చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీహరి, మాజీ ఎమ్మెల్యేలు ధర్మారెడ్డి, అరూరి రమేశ్ సీపీని కోరారు. 24గంటల్లో చర్యలు తీసుకోకపోతే 28న 'చలో ఆత్మకూరు' పేరిట పోలీస్ స్టేషన్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే ఎస్సై ప్రసాద్‌పై వేటు పడినట్లు బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు.

న్యాయం పక్షాన నిలిచిన సీపీకి కృతజ్ఞతలు : చల్లా ధర్మారెడ్డి

జై తెలంగాణ అన్నందుకు అక్రమ అరెస్టులు, థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఘటనలో జై తెలంగాణ నినాదమే గెలిచింది. నేడు ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విరమించుకున్నాం. అక్రమంగా ఏది చేసినా నడుస్తది అనుకునే పోలీసులకు సీపీ నిర్ణయం ఒక హెచ్చరిక లాంటిది. పోలీసులు న్యాయం పక్షాన, ప్రజల పక్షాన నిలవాలి. ప్రజలకు భరోసా కల్పించాలి. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అన్ని వర్గాల వారిని, రాజకీయ పార్టీల ప్రతినిధులను సమానంగా చూడాలి. రాజకీయ ఒత్తిడులను తట్టుకుని నిలవాలి. రాజకీయ ఒత్తిడులకు తలొగ్గితే సమస్యలు తప్పవు. అగ్రంపహాడ్ ఘటనలో పారదర్శకంగా విచారణ చేపట్టి న్యాయం పక్షాన నిలిచిన వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝాకు కృతజ్ఞతలు. మరింత లోతుగా విచారణ చేపట్టి బాధ్యులైన అధికారులనూ శిక్షించాలి. ఎస్సైని సస్పెండ్ చేస్తూ సీపీ తీసుకున్న నిర్ణయం ప్రజలకు భరోసా కల్పించింది.

సమావేశంలో మాట్లాడుతున్న దుగ్గి చిరంజీవి

జాతరలో రూ.105 కోట్లు దుర్వినియోగం

- ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి
- ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు చిరంజీవి

గోవిందరావుపేట, ఫిబ్రవరి 27 : మేడారం జాతర సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.105 కోట్లను దుర్వినియోగం చేసిందని, జరిగిన అన్ని అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు దుగ్గి చిరంజీవి డిమాండ్ చేశారు. మంగళవారం పస్రాలో జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరలో సరైన సౌకర్యాలు లేక భక్తులు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. రూ.105 కోట్లను ఖర్చు చేయగా సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయని, అభివృద్ధి ఎక్కడ జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. జాతర అనంతరం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పారిశుధ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిత్యం దర్శనానికి వచ్చే భక్తుల కోసం మేడారంలో 100 పడకల దవాఖాన నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు వంక రాములు, బెజ్జూరి దామోదర్, ఊకె ప్రభాకర్, ఆలెం అశోక్, కుర్సం ప్రవీణ్, తోలెం కృష్ణయ్య, ఇర్ప శ్రీనివాస్, కోటే కృష్ణారావు, చందా లక్ష్మీనారాయణ, పూనెం నగేశ్ పాల్గొన్నారు.

29న మేడారం హుండీల లెక్కింపు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 27: మేడారం జాతర హుండీలు హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపానికి చేరాయి. దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో మొత్తం 512 హుండీలను మంగళవారం ఆర్టీసీ కార్గో బస్సుల్లో తీసుకువచ్చారు. ఈనెల 29 నుంచి హుండీలు లెక్కించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కేయూలో సర్టిఫికెట్ కష్టాలు..!

కోర్సు పూర్తయినా సకాలంలో అందక విద్యార్థుల ఎదురుచూపులు

సిబ్బంది కొరత, అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు

- అడిగితే అమర్యాద మాటలు.. చీదరింపులు
- వివాదాస్పదంగా ఎగ్జామినేషన్ బ్రాంచ్ సిబ్బంది తీరు
- కంట్రోలర్ సంతకాల కోసం పడిగాపులు

కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోని సుమారు 550 కాలేజీలు నడుస్తున్నాయి. వీటిలో ఏటా 70వేల మంది విద్యార్థులు డిగ్రీలు, పీజీలు పూర్తి చేస్తుండగా, చాలామంది పలు కారణాలతో సర్టిఫికెట్లను సకాలంలో తీసుకోలేకపోతున్నారు. ఎగ్జామినేషన్ బ్రాంచ్ సిబ్బంది స్టూడెంట్లను రోజుల తరబడి తిప్పించుకుంటున్నారు. తీరా సర్టిఫికెట్లు ప్రింట్ అయిన తర్వాత సంతకాల కోసం కంట్రోలర్ అందుబాటులో లేరని, ఒకరు ఉంటే ఇంకొకరు ఉండడం లేదని, అవసరమైతే కంట్రోలర్ ఇంటికి వెళ్లయినా సంతకాలు పెట్టిస్తామని సిబ్బంది అంటున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 27 : కేయూ పరిధిలో డిగ్రీలు, పీజీలు చదివి.. సర్టిఫికెట్లు పొందేందుకు అభ్యర్థులు నెలల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో సిబ్బంది కొరత, ఉన్నతాధికారుల అలసత్వంతో సర్టిఫికెట్ల జారీ ఆలస్యమవుతోంది. ప్రస్తుతం గురుకులాల ఉద్యోగాల కోసం సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతున్నందున ఉద్యోగార్థులు కాన్వొకేషన్‌తో పాటు వివిధ సర్టిఫికెట్ల కోసం కేయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్‌కు వస్తున్నారు. కానీ అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల అక్కడే పిల్లాపాపలతో ఎదురుచూస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యంగా సమాధానాలు

సర్టిఫికెట్ల కోసం వచ్చేవారితో కేయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్ సిబ్బంది అమర్యాదగా మాట్లాడుతున్నారని, నిర్లక్ష్యంగా సమాధానాలిస్తూ, చీదరించుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడికి నిత్యం పెద్ద సంఖ్యలో విద్యార్థులు వస్తున్నా సమాచారం తెలిపే హెల్ప్‌డెస్క్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదని వాపోతున్నారు. వివిధ సర్టిఫికెట్ల జారీ కోసం ఫీజులు కట్టించుకుంటున్న ఆఫీసర్లు, ఏ సర్టిఫికెట్ ఎన్నిరోజుల్లో జారీ చేస్తారో చెప్పకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. ఆన్‌లైన్‌లో తత్కాల్ సర్టిఫికెట్ కోసం రూ.వెయ్యి అదనంగా చెల్లించినా నిర్ణీత సమయంలో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని కొందరు విద్యార్థులు చెబుతున్నారు. దూరప్రాంతాల నుంచి రావాలంటే రవాణా ఖర్చులకు ఇబ్బంది అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేయూ ఎగ్జామ్ బ్రాంచ్‌లో ఎక్కువగా తాత్కాలికంగా పనిచేసే సిబ్బందే ఉన్నారు. రిటైర్డ్ అయిన వాళ్ల స్థానంలో కొత్తవారిని నియమించక డైలీ వేజ్ వర్కర్లతో నెట్టుకొస్తున్నారు. వీరికి ఆన్‌లైన్ పనులపై సరైన అవగాహన లేక దరఖాస్తులు పరిష్కారం కావడం లేదనే విమర్శలున్నాయి. వారు తక్కువ వేతనంతో ఒత్తిడి భరించలేక చేయి తడిపితేనే పనిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో సర్టిఫికెట్లకు డబ్బులు డిమాండ్ చేసిన సిబ్బందిని తొలగించిన విషయం తెలిసిందే.

తెలిసినవారైతే ఓకే..

ఎగ్జామ్ బ్రాంచ్ వద్ద సర్టిఫికెట్ల కోసం బారులు తీరుతున్నారు. తెలిసినవారు మాత్రం నేరుగా సర్టిఫికెట్లు ఇచ్చేవారి వద్దకు వెళ్తుండడంతో బయట కిటికీల వద్ద సర్టిఫికెట్ల కోసం గంటల తరబడి ఎదురుచూస్తున్నవారు సీరియస్ అవుతున్నారు. పలువురు లోపలికి వస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎవరూ లోపలికి రావద్దని అధికారులు కొద్దిసేపు అందరినీ బయటకు పంపి తలుపులు వేస్తున్నారు. అయినప్పటికీ దర్జాగా కేయూ దూరవిద్య కేంద్రంలో పనిచేసే ఓ సిబ్బందితో పాటు రిటైర్డ్ అయినవారు అందులో పనిచేసే కొంతమంది సిబ్బంది.. అలా వెళ్లి సర్టిఫికెట్లు తెచ్చుకోవడం విశేషం. కంట్రోలర్ మాత్రం క్యాండిడేట్‌కు మాత్రమే సర్టిఫికెట్లు ఇస్తామని గట్టిగా చెబుతున్నప్పటికీ సిబ్బంది తెలిసినవారైతే చాలు ఇచ్చేయడం కొసమెరుపు.

ఏడుగురిపై ఫిర్యాదు.. పది మందిని కొట్టారు..

ఈ ఘటనలో ఏడుగురి పేర్లతోనే కానిస్టేబుల్ రమేశ్ ఫిర్యాదు నమోదు చేసి అదనంగా మరో ఆరుగురి పేర్లు కలిపినట్లు సమాచారం. కాంతాల కేశవరెడ్డి, ఆవుల శ్రీనివాస్, మొరె మహేందర్, రేవూరి సుధాకర్‌రెడ్డి, నేరెళ్ల కమలాకర్, ఎండీ జాకీర్‌అలీ, కూస కుమారస్వామిపై ఫిర్యాదు నమోదు కాగా మరో ఆరుగురు సాంబశివరెడ్డి, రేగుల కిశోర్, కాంతాల రవీందర్‌రెడ్డి, వేల్పుల గణేశ్, సిలువేరు రాజు, శ్రీధర్‌రెడ్డి పేర్లను కలిపారు. వీరిలో 10 మందిని స్టేషన్‌కు తీసుకెళ్లి ఇష్టం వచ్చినట్లు కొట్టారు. హనుమకొండలో ఉన్న టాస్క్‌ఫోర్స్ పోలీసుల పేరుతో బట్టలు ఊడదీసి బూతులు తిడుతూ విచక్షణా రహితంగా దాడిచేశారు. ముగ్గురు బీఆర్ఎస్ నాయకులు సిలువేరు రాజు, మొరె మహేందర్, శ్రీధర్‌రెడ్డి పరారీలో ఉన్నారు. పోలీసులు తమ ఇష్టారీతిన బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెడుతూ ఇబ్బంది పెట్టారని రేవూరి సుధాకర్‌రెడ్డి, జాకీర్‌అలీ, కాంతాల కేశవరెడ్డి, వంచ సాంబశివరెడ్డి అంటున్నారు. ఇలా పేర్లు నమోదు చేయడం వెనుక కాంగ్రెస్ పార్టీ హస్తం ఉందని చెబుతున్నారు. జాతరలో ఏమీ జరగకపోయినా కేవలం నినాదాలు చేశారన్న కారణంతో అరెస్ట్ చేసి లాక్కెళ్లి కొట్టడం చూస్తే ఇదంతా అధికార పార్టీ నాయకులు, పోలీసులు కలిసి అడిన నాటకమని విమర్శిస్తున్నారు. జాతర ప్రాంగణంలో గేటు వద్ద 'జై కాంగ్రెస్', 'రేవూరి ప్రకాశ్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి' అంటూ కాంగ్రెస్ నాయకులు నినదించారని 'మీ పార్టీతో ఏమవుతుంది' అని హేళన చేస్తూ రెచ్చగెట్టారని, వారిపై కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. తమవారిని కొట్టిన ఎస్సై సస్పెండ్ కావడంతో ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన13 మంది బీఆర్ఎస్ నాయకుల కుటుంబాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

1న బీఆర్ఎస్ చలో మేడిగడ్డ

- కేటీఆర్, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనాయకులతో బరాజ్ సందర్శన
- తెలంగాణ భవన్ నుంచి నేరుగా మేడిగడ్డకు
- సుమారు 200 మంది రాక

మహదేవపూర్, ఫిబ్రవరి 27 : మార్చి 1న 'చలో మేడిగడ్డ' కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అంబటిపల్లిలో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌ను సందర్శించనున్నట్లు ఆయన మంగళవారం ప్రకటించారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులు సుమారు 200 మందితో కలిసి హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ నుంచి (శుక్రవారం) ఉదయం 8.30 గంటలకు బయలుదేరి నేరుగా మేడిగడ్డకు చేరుకొని బరాజ్‌ను పరిశీలించనున్నారు. కొన్ని నెలల క్రితం మేడిగడ్డ బరాజ్‌లో పియర్‌లు కుంగిన విషయం తెలిసిందే. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం బరాజ్ మరమ్మతు విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్న నేపథ్యంలో దానిని సందర్శించిన అనంతరం కాంగ్రెస్ కుట్రలను ఎండగట్టి , కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో అందుతున్న ఫలాలను కేటీఆర్ ప్రజలకు వివరించనున్నారు.

దవాఖాన ప్రహరీ స్థలం కబ్జాకు యత్నం

పట్టించుకోని సూపరింటెండెంట్

కూల్చేసిన ప్రభుత్వ దవాఖాన ప్రహరీ

ములుగు రూరల్, ఫిబ్రవరి 27 : ఓ వ్యక్తి ఏకంగా ములుగు ప్రభుత్వ దవాఖాన స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించాడు. ప్రహరీని ఆనుకొని ఉన్న స్థలాన్ని చదును చేస్తూ గోడను కూల్చేశాడు. ఈ విషయమై దవాఖాన సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా స్థల యజమానిని పిలిచి మాట్లాడానని, తిరిగి ప్రహరీని కట్టించాలని సూచించామని చెప్పారు. అయితే ఈ విషయమై సూపరింటెండెంట్, పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి ప్రహరీని కూల్చిన వ్యక్తిపై చర్యలు తీసుకొని, స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఐఎఫ్ఎస్‌ల బదిలీలు

హనుమకొండ, ఫిబ్రవరి 27: రాష్ట్ర వ్యాప్తంగా ఐఎఫ్ఎస్ (ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్)లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్‌లోని మహబూబాబాద్, వరంగల్ జిల్లాల అటవీ శాఖ అధికారులు బదిలీ అయ్యారు. మహబూబాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి డాక్టర్ బీ ప్రభాకర్ (ఐఎఫ్ఎస్)ను మీసేవ కమిషనర్‌గా, వరంగల్ జిల్లా అటవీ శాఖాధికారి అపర్ణ (ఐఎఫ్ఎస్)ను ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ హైదరాబాద్ హెడ్ ఆఫీస్‌కు డీసీఎఫ్‌గా బదిలీ చేశారు. అలాగే వెయిటింగ్‌లో ఉన్న డాక్టర్ బి.ప్రభాకర్ (ఐఎఫ్ఎస్)ను కాళేశ్వరం సర్కిల్‌లో ఎగ్జిస్టింగ్ వేకెన్సీ భూపాలపల్లికి పోస్టింగ్ ఇచ్చారు. ఏటూరునాగారం ఎఫ్‌డీవో అంజూ అగర్వాల్ (ఐఎఫ్ఎస్)ను వరంగల్ జిల్లా అటవీ శాఖాధికారిగా, అమ్రాబాద్ ఎఫ్‌డీవో విశాల్ బత్తుల (ఐఎఫ్ఎస్)ను మహబూబాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారిగా బదిలీ చేశారు.



వాజేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతి గదిని చీపురుతో ఊడుస్తున్న విద్యార్థిని

విద్యార్థినులే స్వీపర్లు !

తరగతి గదులను ఊడ్పించిన అధ్యాపకులు

వాజేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘటన

వాజేడు, ఫిబ్రవరి 27 : విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన అధ్యాపకులే విద్యార్థినులతో చీపురు పట్టించారు. బుధవారం నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు జరుగనున్న క్రమంలో మంగళవారం కళాశాలకు వచ్చిన విద్యార్థులతో తరగతులను ఊడిపించారు. ఈ దృశ్యం వాజేడు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కనిపించింది. పరీక్ష తేదీల వివరాలు తెలుసుకునేందుకు 'నమస్తే తెలంగాణ' అక్కడి వెళ్లిన క్రమంలో ఈ విషయం వెలుగుచూసింది. స్వీపర్లతో శుభ్రం చేయించాల్సి ఉండగా కళాశాలలో చదువుతున్న వారితో పనులు చేయించడం చర్చనీయాంశమైంది. ప్రిన్సిపాల్‌ను ఫోన్‌లో వివరణ కోరగా 'స్వీపర్ లేదు.. ఇది సహజమే.. రాద్ధాంతం చేయొద్దు' సమర్థించుకున్నారు.

విద్యార్థులతో పనిచేయించొద్దు : జిల్లా ఇంటర్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు

స్వీపర్ లేదా ప్రైవేట్ వ్యక్తులతో తరగతులు శుభ్రం చేయించాలి. విద్యార్థినులతో పనులు చేయించొద్దు. ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతానన్నారు. కళాశాలలో పనిచేస్తున్న ఒక ఉపన్యాసకుడు సైతం ఫోన్ చేసి తమను ఇబ్బందులకు గురిచేయొద్దని, పేపర్లో రాయొద్దని వేడుకోవడం కొసమెరుపు.

దళితబంధు ఇవ్వాల్సిందే

లేకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తం

- ఎన్నికల కోడ్‌లోగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి
- రాష్ట్ర దళిత బంధు సాధన ఐక్య పోరాట సమితి అధ్యక్షుడు కోగిల మహేశ్, కన్వీనర్ చిట్టిమల్ల సమ్మయ్య
- హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో రెండో విడుత లబ్ధిదారుల నిరసన

హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద ధర్నా చేస్తున్న 2వ విడత దళితబంధు లబ్ధిదారులు

హనుమకొండ, ఫిబ్రవరి 27: రాష్ట్ర ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా దళిత బంధు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేయకుంటే పార్లమెంట్ ఎన్నికల్లో నామినేషన్లు వేస్తామని రాష్ట్ర దళిత బంధు సాధన ఐక్య పోరాట సమితి అధ్యక్షుడు కోగిల మహేశ్, కన్వీనర్ చిట్టిమల్ల సమ్మయ్య హెచ్చరించారు. రెండో విడుత దళితబంధు డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం నిలిపేయడంపై వారి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రెండో విడుతలో ఎంపికైన లబ్ధిదారులు మంగళవారం హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. తమ ఖాతాల్లో వెంటనే దళిత బంధు డబ్బులు జమ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి దళితబంధు పథకంలో కలెక్టర్ ద్వారా పారదర్శకంగా ఎంపికై గ్రౌండింగ్ చేసిన రెండో విడుత లబ్ధిదారుల ఖాతాల్లోకి కలెక్టర్ అకౌంట్‌లో ఉన్న డబ్బులను జమ చేయాలన్నారు. లేని పక్షంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దళితబంధు లబ్ధిదారులం దరం నామినేషన్లు వేస్తామని హెచ్చరించారు. రెండు నెలలుగా శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు, దీక్షలు చేపట్టినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇంకా స్పందించకుంటే భవిష్యత్తులో ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా కార్యాచరణ రూపొందించుకుంటామని అన్నారు. రెండో విడుత దళిత బంధు ద్వారా ఎంపికై గ్రౌండింగ్ అయిన లబ్ధిదారులను మార్పులు చేర్పులతో కాలయాపన చేయొద్దని, వారందరూ దళిత బిడ్డలేనని గుర్తించాలని సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి మండలికి పలుమార్లు విజ్ఞప్తి చేశామన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు పథకాన్ని కొనసాగిస్తామని, అందు కు బడ్జెట్‌లో రూ.1000కోట్లు కేటాయిస్తామన్న ప్రకటనను స్వాగతించామని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాష్ట్ర దళిత బంధు సాధన సమితి నాయకులు కావేరి చిన్ని కృష్ణ, మడికొండ రమేశ్, బోనగిరి శ్రీనివాస్, దర్శనాల సంజీవ, దుర్గం రాజేశ్, ఏకు కార్తీక్, ఐత ప్రశాంత్, కనకం విశ్వనాథ్, అచ్చుకట్ల రమేశ్, భూపెల్లి రాజు, గోల్కొండ బుచ్చన్న, మాదరి రాంబాబు రామకృష్ణ, రమేశ్, గాజర్ల వెంకన్న, ఎడ్ల కిరణ్, బీసా సాంబయ్య పాల్గొన్నారు. కాగా, మహేశ్, సమ్మయ్య ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళితుల ఆకాంక్షలను గుర్తించి న్యాయం చేయాలని, అరెస్టులు, నిర్బంధాలు సరికావన్నారు.